క్లుప్తంగా

షటర్లకు బహిరంగ వేలం


శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్

దుబ్బాకటౌన్: పట్టణంలో మూడు చోట్ల ఉన్న 11 మున్సిపల్ షటర్లకు 3వ తేదీన అద్దె ప్రతిపాదికన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పోచమ్మ దేవాలయ సమీపంలో ఉన్న ఒక్క షటర్, శాస్త్రి విగ్రహ సమీపంలో ఉన్న మరో ఆరు షటర్లకు, డబుల్ బెడ్రూం సమీపంలో ఉన్న నాలుగు షటర్లకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు పోచమ్మ సమీపంలో ఉన్న షటర్‌కు రూ.50 వేలు, మిగతా రెండు చోట్ల ఉన్న షటర్లకు రూ.25 వేలు డీడీ తీసి దరఖాస్తు ఫారంతో 2వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. రిజర్వేషన్ల ప్రకారం వేలం నిర్వహిస్తామన్నారు.

రసాయన ఎరువులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం


సమావేశమైన సోమిరెడ్డి, సారయ్య తదితరులు

నంగునూరు(సిద్దిపేట): జీలుగ, జనుము విత్తనాల రేట్లను రెండింతలు పెంచి, సరిపడా పంపిణీ చేయకుండా ప్రభుత్వం రసాయన ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తోందని మాజీ ఏఎంపీ చైర్మన్ సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్య ఆరోపించారు. పాలమాకులలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు ఇవ్వడంతో పాటు నెల రోజుల ముందే అందుబాటులో ఉంచేదన్నారు. కార్యక్రమంలో లింగంగౌడ్, రవీందర్‌రెడ్డి, వేణుచక్రవర్తి, అయిలయ్య, శంకర్, వెంకట్, బుచ్చయ్య, బాలమల్లు, కుమారస్వామి, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంస్కర్త


నివాళులర్పిస్తున్న లింగమూర్తి తదితరులు

హుస్నాబాద్: సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలు ప్రారదోలడానికి పోరాడిన భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం పాలనలో విద్యా వ్యాప్తి కోసం, వితంతువుల పునర్వివాహం, దేవదాసి వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డివర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వివిధ పార్టీల నాయకులు రవీందర్, ఎండీ హుస్సేన్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, శంకర్, రాజు, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండాపూర్‌లో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.5 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేప ట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌రెడ్డి, రాజేశ్, భూపాల్‌గౌడ్, శంకర్, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రశాంత్, జహంగీర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జాబితా విడుదల


జాబితా విడుదల చేస్తున్న ఎంఈఓ ప్రభుదాస్

దుబ్బాకటౌన్: మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల వివరాలను మండల విద్యాధికారి ప్రభుదాస్, లచ్చపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు గురువారం మోడల్ స్కూల్లో విడుదల చేశారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతామని, 26 నుంచి 31లోగా సంబంధిత పత్రాలతో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.

నాడు అభివృద్ధి.. నేడు అధ్వానం

చెరువు, కుంటలను పట్టించుకోని ప్రభుత్వం

- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న చెరువులు
- మరమ్మతులకు నోచుకోని తూములు, అలుగులు


తిగుల్‌లో మహాసముద్రం చెరువుకట్టపై మొలిచిన పిచ్చిమొక్కలు

గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు, కుంటలను పునరుద్ధరించింది. దీంతో పొలాలకు తగినంత సాగునీరం దడానికి ఆస్కారం ఏర్పడింది. కానీ నేడు పట్టించుకోకపోవడంతో కట్టలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. దీంతో స్థానికులు, వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువుల పునరుద్ధరణ చేపట్టింది. అది సత్ఫలితాలనిచ్చింది. నేడు వాటిని పట్టించుకోకపోవడంతో చెరువులు, కుంటలు యథాస్థితికి చేరుకున్నాయి. పునరుద్ధరణలో చేపట్టిన కట్ట మరమ్మతులు, తూములు, పూడీకతీత పనులు చపట్టడంతో నీటి సామర్థ్యాన్ని పెంచాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటి నిర్వహణపై దృష్టిసారించకపోవడంతో నిర్లక్ష్యపు నీడలో మగ్గిపోతున్నాయి. సమృద్ధిగా వర్షాలు కురిస్తే చెరువు, కుంటలకు గండి పడే ప్రమాదం లేకపోలేదు. చెరువుకట్టలపై ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు మొలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పట్టింపేదీ..

జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో మొత్తం 110 చెరువులు, కుంటలు ఉన్నాయి. అలాగే రాచకట్ట జలాశయం, బొరబండ ప్రాజెక్టు ఉన్నాయి. 2014లో చేపట్టిన మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువు, కుంటల అభివృద్ధికి నిధులు కేటాయించి పునరుద్ధరణ చేపట్టారు. నాలుగేళ్ల పాటు తూముల మరమ్మతులు, కట్టలను బలోపేతం, వరద కాలువలను పునర్నిర్మించారు. ఆ తర్వాత పథకం ద్వారా చెరువుల నిర్వహణపై దృష్టి సారించే వారే లేకుండా పోయారు. చాలా గ్రామాల్లో చెరువుకట్టలపై కంప చెట్లు పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటి వేర్లు లోపలికి వెళ్లి కట్టలు దెబ్బతింటున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు, కుంటల్లో నామమాత్రంగానే పూడికతీత పనులు చేపడుతున్నారు. కానీ కట్టపై ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లను పూర్తిగా తొలగించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టలు తెగినా, అలుగులు దెబ్బతిన్నా మరమ్మతులకు నిధులు కేటాయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి పనుల ద్వారా తొలగించుకోవాలి

గ్రామాల్లో చెరువు, కుంటల కట్టలపై పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఉపాధి హామీ పథకం పనుల ద్వారా తొలగించుకోవాలి. తూములు, అలుగు దెబ్బతింటే ఇరిగేషన్ ద్వారా మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

\- అరుణ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు

వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీదేవి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక, ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలో గురువారం 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయరంగంలోని వచ్చిన సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, నూతన వంగడాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడితే పంట దిగుబడి తగ్గుతుందని వివరించారు. పంట మార్పిడితో భూసారాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు ఖలీల్, కవిత, రేఖ, భాను, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, లక్ష్మి, జనార్దన్ రెడ్డి, రమేశ్, రవి, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసా గోవిందా..


కలశాలతో వస్తున్న వేద పండితులు, అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మోహిని పుర వేంకటేశ్వర ఆలయ స్వర్ణోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా గురువారం మన్యు సూక్త సంపుటీకరణ హవనం, శాలాబలి మహా పూర్ణాహుతి, ద్వాదశ ఆరాధన, శ్రీపుష్పయాగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు భక్తుల సందడితో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం అష్టోత్తర శత ఘటాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


రైతువేదికలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జగదీశ్, లక్ష్మారెడ్డి తదితరులు

- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- పోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): యువత డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఆ మహమ్మారిని తరిమికొట్టాలని డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నియోజకవర్గ ఇన్‌చార్జి వేముల జగదీశ్, జేఏసీ నాయకుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రైతువేదికలో గురువారం డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనపై ఇప్పటికే నియోజకవర్గంలోని దాదాపు 40వేల మందికి అవగాహన కల్పించామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా శుక్రవారం గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెరువుతండా తదితర గ్రామాల్లో మహిళా సంఘాలు, గ్రామస్తులతో సహాయంతో అవగాహన కల్పించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ్ భాస్కర్, నాయకులు వీరన్న, ఎల్లయ్య, సంజీవ్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలలో తనిఖీలు


చిన్నకోడూరు(సిద్దిపేట): రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ సైఫ్ అలీ, ఏఓ జయంత్

చిన్నకోడూరు(సిద్దిపేట): విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను ప్రొబిషన్ ఎస్ఐ సైఫ్ అలీ, మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, విత్తనాలు, పురుగుల మందుల బస్తాలను పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, పురుగుల మందులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఓ జయంత్ కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలని రైతుకు సూచించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు..

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏఓ సంతోష్, ఎస్‌హెచ్‌ఓ, ఏఎస్ఐ శంకర్‌రావు తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు, క్రిమిసంహారక మందులను అమ్మవద్దని దుకాణదారులకు సూచించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని చెప్పారు.

రైతులను మోసం చేస్తే ఊరుకోం..

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులను మోసం చేసే దుకాణదారులపై చర్యలు తప్పవని ఎస్ఐ విజయ్ భాస్కర్, మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా హెచ్చరించారు. మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వారి వెంట కానిస్టేబుల్ రాజ్‌కుమార్ ఉన్నారు.

చర్యలు తప్పవు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై చర్యలు తప్పవని టూటౌన్ సీఐ ఉపేందర్ హెచ్చరించారు. అర్బన్ ఏఓ శ్రీనాథ్‌తో కలిసి పట్టణంలోని ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ దుర్గ


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ పిలుపునిచ్చారు. రంగదాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు గురువారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా మహిళలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా, వెంబడించినా 100, 112, 1098, షీ టీమ్ వాట్సప్ నంబర్ 87126 67343, మహిళా పోలీస్ స్టేషన్ 87126 67435, హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 94407 00906, 040-27852246 ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు నమ్మొద్దు

సిద్దిపేటఅర్బన్/బెజ్జంకి(సిద్దిపేట): అపరిచిత వ్యక్తుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని మిట్టపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పీఈటీలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. షీ టీమ్, ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి ఎస్‌హెచ్‌ఓ శంకర్‌రావు సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో అపరిచితులు పంపే సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు


మాట్లాడుతున్న జాన్ షాహిద్

గజ్వేల్‌రూరల్: అత్యవసర సమయాల్లో ఈఎంఆర్ఐని ఆశ్రయించే ప్రజలకు మెరుగైన సేవలందిస్తే మంచి గుర్తింపు వస్తుందని ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జాన్‌షాహిద్ అన్నారు. గజ్వేల్‌లోని 108, 102, 1962, ఎఫ్‌హెచ్ఎస్ తో పాటు నియోనేటర్ వాహనాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఎంఆర్ఐ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఈఎంటీ హరి రామకృష్ణ, పైలెట్‌లు, ఈఎంటీలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా చంద్రశేఖర్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి తహసీల్దార్‌గా చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి మిరుదొడ్డికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను రేషన్ డీలర్లు వెంకటేశం, పెద్దన్న, మోహన్, రామచంద్రం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కోటిలింగాల ఆలయ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌జీఓస్, హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ కాలనీ, గాంధీనగర్, మంగలి కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

'ఇందిరమ్మ ఇళ్ల'లో అవినీతికి తావివ్వొద్దు

- గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


మాట్లాడుతున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవినీతికి తావులేకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అధికార పార్టీ నాయకులు రూ.40 వేల నుంచి 50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఇళ్ల నిర్మాణంలో షరతులను ఎత్తివేసి నచ్చిన విధంగా నిర్మించుకునేందుకు స్వేచ్ఛ కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు తాము చెప్పిన వారికే ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను బెదిరించడం మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, రవీందర్, శారద, ఇస్తారి, మల్లేశం, సాయిలు, బాలకిషన్, శ్రీను, భిక్షపతి పాల్గొన్నారు.

అకాల వర్షం.. మిగిల్చిన కష్టం


దుబ్బాక: చెల్లాపూర్‌లో కూలిన ఇల్లు


బెజ్జంకి(సిద్దిపేట): చిలాపూర్‌లో కూలిన పాఠశాల గోడ

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు పలుచోట్ల ఇళ్లు కూలాయి. పైకప్పులు ఎగిరిపడ్డాయి. దుబ్బాక మున్సిపల్‌లోని చెల్లాపూర్‌లో గుండవెల్లి పోచయ్య, ఈశ్వరవ్వతో పాటు పట్టణంలో పలువురి ఇళ్లు కూలాయి. చాలా చోట్ల ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అదేవిధంగా బెజ్జంకిలోని చిలాపూర్ ప్రాథమిక పాఠశాల భవనం గోడ పాక్షికంగా కూలింది. వేసవి సెలవులు కావడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మొలకలు వస్తున్నా కొనుగోలు చేయరా?

దిశ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌చారి

దుబ్బాక: అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి మొలకలు వస్తున్నా కొనుగోలు చేయకపోవడం దారుణమని దిశ కమిటీ సభ్యుడు సుంకోజి ప్రవీణ్‌చారి ఆవేదన వ్యక్తం చేశారు. చేర్వాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం తడిసి మొలకలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కుప్పల మీద కప్పేందుకు కవర్లు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. దీంతో ఆయన అధికారులకు ఫోన్‌చేసి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట శ్రీకాంత్ యాదవ్, రమేశ్‌రెడ్డి, రమణారెడ్డి, మనోజ్, నరేశ్‌రెడ్డి, భరత్‌చారి తదితరులు ఉన్నారు.

వేగవంతం చేయాలి..

ములుగు(గజ్వేల్): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ అధికారులను కోరారు. మండలంలోని సింగన్నగూడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అకాల వర్షానికి తడసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. భాగ్యలక్ష్మి, హరికృష్ణ, మహేశ్‌గౌడ్, బాబు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రికార్డు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్


మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సాధించిందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలలో డబ్బులను జమచేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నారని, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధు, గయాజొద్దీన్, స్టేట్ మైనారిటీ సెక్రెటరీ హర్షద్, నజ్జు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ.. అభయమియ్యవయ

హనుమాన్ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ మాలదారులు వైభవంగా పూజలు నిర్వహించి దీక్ష విరమించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


హుస్నాబాద్: శివాజీనగర్ ఆంజనేయుడికి పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


దౌల్తాబాద్(దుబ్బాక): హనుమాన్‌కు మొక్కుతున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు


బెజ్జంకి(సిద్దిపేట): గాగిల్లాపూర్‌లో పవలింపు సేవ


వర్గల్‌లో హోమం నిర్వహిస్తున్న మాలధారులు


చిన్నకోడూరులో హోమాలు చేస్తున్న దీక్షదారులు

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీపీఐ జిల్లా నేత అశోక్



మాట్లాడుతున్న అశోక్

చేర్యాల(సిద్దిపేట): అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. మండల పరిధిలోని రాంపూర్‌లో బండారి సిద్దయ్య అధ్యక్షతన గురువారం జరిగిన గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయకపోవడంవల్ల కార్మికుల భద్రత కరువైందన్నారు. గ్రామంలో బీటీ రోడ్డు ధ్వంసమై ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే ఆకునూర్, రాంపూర్, నుంచి వయా నర్సాయపల్లి మీదుగా చేర్యాల వరకు; రాంపూర్ నుంచి కొత్త దొమ్మాట క్రాస్ రోడ్డు వరకు బీటీరోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీ ఎంపిక చేశారు.